రైతన్నకు తుపాను కష్టాలు

● చేతికొచ్చిన పంటను దక్కించుకునేందుకు తలమునకలు



వరి పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం

దామరగిద్ద: వానకాలం సాగులో రైతులు సాగుచేసిన ప్రధాన పంటల్లో కోత దశలో ఉన్న వరి, కంది పంటలపై మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతరెండు రోజులుగా తుఫాను ప్రభావంతో మబ్బులు కమ్ముకోవడం, ముసురు వర్షాలు కురుస్తుండటంతో చేతికొచ్చిన పంటలను చేజిక్కించుకునేందుకు రైతులు తలమునకలవుతున్నారు. వైపు పంట నూర్పిడి యంత్రాల కొరతతో వాటి కోసం ఎదరుచూస్తుండగా మిచాంగ్ తుఫాను తీవ్రరూపం దాల్చడంతో వేలల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు చేతికందుతాయో లేదోఅన్న ఆందోళన మొదలైంది.

కంది, వరి రైతులకు నష్టం..

ప్రధానంగా మండలంలో ఎనిమిది వ్యవసాయ క్లష్టర్ల పరిధిలో అత్యధికంగా కంది పంటను సాగు చేశారు. దాదాపు 11,500 ఎకరాల్లో కందిసాగు చేయగా గత ఆగస్ట్, సెప్టెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలకు వెయ్యి ఎకరాలకు పైగా పంట వేరుకుళ్లు తెగులు సోకి వందల మంది రైతుల కంది పంటను పూర్తిగా నష్టపోయారు. అకాల వర్షాలకు తట్టుకొని నిలిచి కంది పంటకు తీరా పూత పిందె దశలో వర్షాలు కురువక పోగా బోరు బావులు కల్గిన రైతులు ఆరుతడిని అందించి పంటలను పండించారు. తీర పంట కోత సమయంలో తుఫాను ప్రభావం రైతును మరింత నష్టం కల్గించనుంది. నూర్పిడి యంత్రాలు వెళ్లని రైతులు సాంప్రదాయ పద్ధతిలో కంది పంట నూర్పిడి చేసుకోవడంతో కూలీల దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు.

నూర్పిడి యంత్రాలకోసం ఎదురుచూపు..

మండలంలో కంది తరువాత వరి విస్తీర్ణంలో రెండో స్థానంలో ఉంది. దాదాపు పదివేల ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతదశలో ఉండగా ఇప్పటికే పలువురు రైతులు పంటలు నూర్పిడి చేసుకోగా మరో యాభైశాతం రైతులు తమ పంటల నూర్పిడికి యంత్రాల కొరతతో నేడు, రేపు అంటు యంత్రాల కోసం ఎదరుచూస్తున్న దుస్థితి నెలకొంది. పంట నూర్పిడి చేపట్టిన రైతులు తమ పంటను వరి కల్లాలో టార్పలిన్‌లతో పంట సంరక్షణ చేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో పంటల సాగు ఆలస్యం కావడం ఇప్పటి కే చేతి కందాల్సిన పంటలు ఇంకా నూర్పిడి చేసుకోలేక పోవడంతో యాసంగి సాగు సైతం ఆలస్యమవుతున్న పరిస్థితి నెలకొంది.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సిబ్బంది

నారాయణపేట రూరల్: ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి వాటికి నెంబర్ ప్లేట్ వేయించారు. ఈమేరకు.. వారు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే నెంబర్‌ప్లేట్ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టులు కానివారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టుకోవద్దన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణత వేగంతోనే వాహనాలను నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, ఇష్టారీతిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే ఫైన్ కట్టాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మధు, దేవేందర్ పాల్గొన్నారు.

నేల తల్లిని సంరక్షించుకుందాం



కంసాన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ

దామరగిద్ద: పంటలను పండించుకునే నేలతల్లిపై రసాయన ఎరువుల సమతుల్యాన్ని పాటించి నేలను సంరక్షించుకుందామని కోరమండల్ ఇంటర్‌నేషనల్ మార్కెటింగ్ అధికారి మంజునాథ్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్ర వేత్త శివ, ఏఈఓలు గోపాల్, స్వప్న, నరేష్, తిలక్‌రత్న, అజయ్, అనిల్ బార్గవి, శివజ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని మద్దెల్‌బీడ్‌లో కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రపంచ భూసార ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించి నేలసంరక్షణ, సారవంతాన్ని పెంచుకోవడంలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఎనిమిది క్లష్టర్ల పరిధిలో ఆయా క్లష్టర్ ఏఈఓలు రైతులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. నేల కోతను అరికట్టడం, సేంద్రియ పదార్థాలను మెరుగుపరచడం, రసాయన ఎరువులను తగ్గించడం, వంటి నేల సంరక్షణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో నేలలను, పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రైతులు పాల్గొన్నారు.

వన్‌టైం సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నర్వ: పీఏసీఎస్, ఆత్మకూర్ సహకార బ్యాంకులో దీర్ఘకాల రుణాలు తీసుకున్న రైతులు వన్‌టైం సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 2009, 2010లో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఈ నెల 11న, ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటలకు పీఏసీఎస్ కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో రైతులకు వన్‌టైం సెటిల్‌మెంట్‌తో పొందే ప్రయోజనాలపై రైతులతో బ్యాంకు అధికారులు చర్చిస్తారన్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ చేసే రైతులకు ఎలాంటి అపరాద వడ్డీ కట్టనవసరం లేదన్నారు. సహకార సంఘానికి భూములు తనాఖ పెట్టిన రైతులు సకాలంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ భూములపై పూర్తి హక్కులు పొందాలని ఆశిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి మండల రైతులు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు హాజరై రుణ సమస్యల నుంచి విముక్తి కావాలని కోరారు.

అధికార పార్టీని నిలదీస్తాం..

మరికల్: అధికార కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చినహామీలను అమలు చేయకుంటే ప్రతిపక్షహోదలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేసే పథకాలకు సమయం ఇస్తామని, అవి అమలు చేయకుంటే మాత్రం తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ గోపాల్, రాజుగౌడ్, నర్సింహులు ఉన్నారు.

రామాయణం సకల మానవాళికి ఆదర్శం



ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ఇస్తున్న ప్రవచనకర్త

నర్వ: శ్రీ రామాయణం నేటి సకల మానవాళికి ఆదర్శమని హిందు ధర్మ ప్రచార సమితి ప్రవచనురాలు నీరజ అన్నారు. మంగళవారం రాత్రి నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించే ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు శివాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు. శ్రీ మద్రామాయణం ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ఆమె ప్రారంభించారు. శ్రీ రామచంద్రమూర్తి, సీతమ్మ వారి ఆదర్శ జీవితాలు మానవళి అనుసరించి తమ జీవితాలను మంగళప్రధంగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నిత్య ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే అంతా శుభాలే కలుగుతాయన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ, హిందు ధర్మప్రచార సమితి సభ్యులు, నిర్వాహకులు సరేష్, ఆలయ అర్చకులు సిద్ధయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ శివారులో 169 సర్వేనంబర్‌లోని పదిఎకరాల 12 గుంటల అసైన్డ్‌మెంట్ భూమిని గత 30సంవత్సరాలుగా సాగులో ఉన్నామని, ఇప్పుడు కొందరు దౌర్జన్యంగా మేము కొన్నామని తమను బెదిరిస్తున్నట్లు ఆ భూమి యజమానులు చెట్టి శాంతప్ప, రాకేట్ తిమ్మక్కచెట్టి బస్వరాజ్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అ భూమికి సంబంధించిన అన్నిరకాలు యాజమాన్యపు హక్కుల ధృవపత్రాలు తమవద్ద ఉన్న.. తమపై అక్రమ కేసులు వేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తమకు తగు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం



నారాయణపేట: నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని గెలిపించేందుకు ఆహర్నిశలు పనిచేసిన కోయిలకొండ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను మంగళవారం పేట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వారి వారి గ్రామాలకు చేరుకొని శాలువాతో సన్మానించారు. సింగిల్ విండో డైరెక్టర్ మల్లేశ్, యువనాయకులు మనోజ్ పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు న్యాయం చేయండి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయిలో ఎంపికైన కరాటే విద్యార్థులకు అంతర్‌జిల్లాస్థాయి ఎంపికలకు సమాచారం ఇవ్వకుండా అన్యాయం చేశారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ కరాటే మాస్టర్లు అశ్వాక్, పి.లక్ష్మణ్ మంగళవారం జిల్లా కేంద్రంలో డీఈఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది అక్టోబర్ 29న జడ్చర్ల పట్టణంలోని స్టేడియంలో అండర్–14 జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపికలు నిర్వహించగా విద్యార్థులు ఎండి.అసద్, రహీలు ఎంపికయ్యారని, వీరికి అంతర్‌జిల్లాఎంపికలు సమాచారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని వినతిలో పేర్కొన్నారు. మంగళవారం నల్గొండలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారన్న విషయం తెలిసిందని, న్యాయం చేయాల ని వారు విజ్ఞప్తి చేశారు. ఈవిషయమై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబును వివరణ కోరగా జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి సమాచారం ఇవ్వమని ఎంపికలు నిర్వహించిన మాస్టర్‌కు తెలియజేశానని, తాను ఇతర జిల్లాల కార్యదర్శులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ క్లబ్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్‌శాఖ ఆధ్వర్యంలో ఐఎస్ఎల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న నిర్వహించిన ఇంటర్ కళాశాల కరాటే టోర్నమెంట్‌లో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో క్లబ్ విద్యార్థి మహ్మద్ అర్ష్ జమీల్ బంగారు పతకం సాధించి మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌లో త్వరలో జరిగే సౌత్‌వెస్ట్ జోన్ యూనివర్సిటీ కరాటే టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా క్లబ్‌కు చెందిన మరో విద్యార్థి ఉజేఫ్ షరీఫ్ కుమితే విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, ఐఎస్ఎల్ కళాశాల స్పోర్ట్స్ డైరెక్టర్ అలీలు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన రిషి విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహించిన అండర్ –17 ఫుట్‌బాల్ జట్ల ఎంపికలో జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాల విద్యార్థులు ముస్తఫా, కె.రాహుల్‌లు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. శ్లోక స్కూల్ విద్యార్థుల బృందం ఉత్తమ ప్ర దర్శన కనబర్చింది. రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పో టీలకు బృందం ఎంపికై నట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఉర్సు

చిన్నచింతకుంట: మండలం అప్పంపల్లి గ్రామంలో రెండు రోజుల పాటు మహబుబ్ స్వాని ఉర్సు ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామికి పూలు, గంధం సమర్పించారు. మంగళవారం పాతేహాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వీట్లు పంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలనుంచి భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. మతపెద్దలు పాష, బషీర్, జుబేర్ మరియూ శంకర్, కమలాకర్, సుదర్శన్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, పి రాఘవరెడ్డి, మోహన్‌కుమార్, లతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ప్రయాణ ఎదురీత..



పెద్ద కడ్మూర్ కంకరతో కూడిన రహదారి

నర్వ: గత రెండేళ్లుగా మక్తల్, గద్వాల్ ప్రధాన రోడ్డు పూర్తి దెబ్బతినడంతో గత కొన్నినెలలుగా రహదారిని పూర్తిగా తొలగించి కొత్త రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నత్తను తలిపిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా సత్యావార్ నుంచి పెద్దకడ్మూర్ మీదుగా మిట్ట నందిమల్ల వరకు రోడ్డును తొలగించి కంకర పర్చే పనులు చేపట్టారు. ఈ కంకర వేసి రెండు నెలలు గడుస్తున్న పనులు ముందుకు సాగడం లేదు. దీంతోపాటు మిట్టనందిమల్ల నుంచి జూరాల డ్యాం వరకు అడుగడుగున మోకాళ్ల లోతు గుంతలతో ప్రయాణమంటేనే ఏడుపొస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసేలా అధికారులు ఒత్తిడి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



మద్దూరులో..



నారాయణపేటలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్‌శ్రేణులు

నారాయణపేట: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అదిష్టానం ప్రకటించడంతో మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకొని సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సదాశివారెడ్డి, సీనియర్‌నాయకులు హన్మంతు, కౌన్సిలర్ ఎండీ సలీం పాల్గొన్నారు.

కోస్గి: రాష్ట ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేస్తూ కాంగ్రెస్ జాతీయ నేతలు ప్రకటించడంపై మంగళవారం పార్టీ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. స్థానిక శివాజీ చౌరస్తాలో యువకులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. గుండుమాల్, నాచారం, సర్జఖాన్‌పేట, ముశ్రీఫా, చంద్రవంచ, కొత్తపల్లి, మాసాయపల్లి, పోతిరెడ్డిపల్లితోపాటు పలు గ్రామా ల్లో పెద్ద ఎత్తున టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

మద్దూరు: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అదిష్టానం ప్రకటించడంతో మద్దూరు, కొ త్తపల్లి మండలాల్లోని అన్ని గ్రామా ల్లో, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. మద్దూరులోని రాజీవ్‌గాంధీ చౌరస్తా లో పార్టీ నాయకులు బా ణా సంచా పేల్చి ఒకరికొకరు శుభకాంక్షలు తెలుపుకున్నారు.

మరికల్: రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా అదిష్టానం ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం మండలంలోని స్థానిక చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వీరన్న, ఆనంద్, రామకృష్ణ, సత్యన్న, మొగులప్ప, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



కోస్గిలో సంబరాలు చేసుకుంటున్న యువకులు



మరికల్‌లో సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మరికల్: మండల కేంద్రంలోని పటేల్‌రోడ్డుకు చెందిన మురళి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందడంతో మంగళవారం సూర్యచంద్ర ఫౌండేషన్ నిర్వాహకులు సూర్యమోహన్ అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయంగా బాధితకుటుంబానికి రూ. 10వేలు అందజేశారు. పేదకుటుంబంలో ఏ ఆపదవచ్చిన తమ సంస్థ వారిని ఆదుకోవడంకోసం ముందుటుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, రాఘవేందర్, ఆంజనేయులు, రవి, మొగులప్ప పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవతకు పూజలు



మరికల్: మండలంలోని తీలేర్‌లో మంగళవారం ఎల్లమ్మ దేవతకు గ్రామస్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా జల్దిబిందెను తీసుకెళ్లి అమ్మవారికి జల, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అభరణాలతో అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతమ్మతోపాటు ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాయమవ్వ బోనాలు



మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో మంగళవారం తాయమ్మవ్వ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. మహిళలు అందంగా అలంకరించిన బోనాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం అమ్మవారికి పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ, ఉపసర్పంచ్ పద్మమ్మ, గ్రామపెద్దలు నర్సింహులు, వెంకటేష్, గణేష్, కృష్ణ, నరేష్, రాఘవేంద్ర, రమేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతు



మరికల్: మండలంలోని జిన్నారం గ్రామ పంచాయతీపరిధిలోని జీబండాతాండకు వెళ్లే రోడ్డును మంగళవారం బీజేపీ నాయకులు మొరం వేసి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రమేశ్వర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో మక్తల్ బీజేపీ అభ్యర్థి ఓడిన, గెలిచిన జీబండాతాండ రోడ్డు మరమ్మతులు చేస్తామని ఇచ్చినహామీ మేరకు రోడ్డు మరమ్మతులు పనులు చేస్తున్నట్లు తెలిపారు. హామీని నిలబెట్టుకున్నందుకు తాండ ప్రజలు బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నైతిక విజయం మనదే

నారాయణపేట: మక్తల్ నియోజకవర్గంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నైతిక విజయం సాధించిందని ఎమ్మెల్యే అభ్యర్థి మా ది రెడ్డి జలంధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో దాదాపు 46 వేల ఓట్లు సా ధించిన అతి కొద్ది మందిలో బీజేపీ అభ్యర్థుల్లో తాను ఒకడినని గర్వంగా చెప్పారు. ఈ మేరకు.. పార్టీ కోసం నిర్విరామంగా పనిచేసిన నేతలు, కార్యకర్తలు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశా రు. ఆదేవిధంగా మక్తల్‌లో గెలిచిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

మరికల్: ఎంపీపీ గ్రామంలోనే బీఆర్ఎస్ పునాదులు కదిలించామని కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్ అన్నారు. మంగళవారం జిన్నారంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి జిన్నారం ఎంపీపీ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థిపై 336ఓట్ల మెజార్టీ సాధించడంపై ఆనందంగా ఉందన్నారు. మల్లికార్జున్, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, శాంతిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.